సాక్షి కృష్ణాజిల్లా

మంగళవారం । 21 । నవంబర్ । 2023




దుర్గమ్మ సేవలో...

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు కుటుంబ సమేతంగా సోమవారం దుర్గమ్మను దర్శించుకున్నారు.



రైతుల సంక్షేమమే ధ్యేయం

కోడూరు: అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మండలంలోని ఉల్లిపాలెం పీఏసీఎస్ వద్ద సోమవారం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం 524.50 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,440, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చేసిన మంత్రిని ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ ఏఈవో చంద్రశేఖర్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందచేశారు. వన్‌టౌన్ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి(పాత శివాలయం) వార్ల దేవస్థానాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాజన్నదొర సోమవారం సందర్శించుకున్నారు.

బీసీ కులగణన చారిత్రాత్మక ఘట్టం



లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో బీసీల కుల గణన చేయడం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను కలిసి బీసీ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా కేసన శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ కులాల గణన చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని చెప్పారు. బీసీ కులాల గణన చాలా పారదర్శకంగా నిర్వహించాలని, ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా, ప్రజల హృదయాల్లో చిరస్థాయిలో నిలిచిపోయేలా చేయాలని కోరారు. సంచారజాతులు వంటి కులాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, షేక్ ముస్తాఫా, మేకా వెంకటేశ్వరరావు, కనకారావు, చెప్పాడ చందు తదితరులున్నారు.

సాహితీ వికాసానికి తెలుగు అకాడమీ కృషి



విజయవాడ కల్చరల్: తెలుగు సాహితీ వికాసానికి తెలుగు అకాడమీ కృషి చేస్తుందని తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. 56 వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన ముగింపు వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు సాహిత్యానికి అంతర్జాతీయ కీర్తి తెచ్చిన మహనీయుల సేవలను నిత్యం స్మరించుకోవాలని సూచించారు. తెలుగు అకాడమీ ప్రచురించిన అన్ని పుస్తకాలను గ్రంథాలయాలకు పంపిణీ చేస్తామని తెలిపారు. సర్వోత్తమ గ్రంథాలయ నిర్వాహకురాలు డాక్టర్ రావి శారద, హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరావు, బహుగ్రంథ కర్త డాక్టర్ జీవీ పూర్ణచందు, గ్రంథాలయ కమిటీ సభ్యులు బెల్లపు బాబ్జీ, నీలం దుర్గారావు, ఆదాం, ఉద్యోగులు కృష్ణప్రియ, అరుణ పాల్గొన్నారు. నిర్వాహకులు డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతిని ఆత్మీయంగా సత్కరించారు.

యార్డుకు 29,271 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 26,681 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,271 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.8,500 నుంచి రూ.23,200 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 25,000 వరకు ధర లభించింది.

కార్తిక కాంతులు



కార్తికమాసం తొలి సోమవారం నేపథ్యంలో దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయాలకు చేరుకొని కార్తికదీపాలు వెలిగించారు. ప్రధానంగా శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. నాగాయలంక శ్రీరామపాద క్షేత్రంలో రామలింగేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. కృష్ణానదితో పాటు సముద్రతీరంలో పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులు తరలివచ్చారు. విజయవాడలోని పలు శివాలయాల్లో కార్తికదీపాలు వెలిగించి పూజలు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



చిరు జల్లులతో రైతుల్లో గుబులు



కంకిపాడు: ఖరీఫ్ వరి పంట చేతికందే తరుణంలో వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్మేసింది. పలు చోట్ల అక్కడక్కడా జల్లులు కురిశాయి. ఇప్పటికే రైతులు వరి పంట కోతకోసి బహిరంగ ప్రదేశాల్లో ఆరబోసుకున్నారు. మరికొన్ని చోట్ల కూలీలతో కోత కోయించటంతో పనలు పొలాల్లో ఉన్నాయి. వాతావరణం మబ్బులు కమ్మటంతో పాటుగా చిరుజల్లులు కురవటంతో ఆరబోసిన ధాన్యం రాశులుగా ఎత్తి తడిచిపోకుండా పరదాలు కప్పుకున్నారు. తడిచిన వరి పనలను ఆరబెట్టే ప్రయత్నం చేశారు. మబ్బులు, చలిగాలులు కొనసాగుతుండటంతో రైతుల్లో గుబులు రేగుతోంది.

కొండలమ్మకు రూ.26.17 లక్షల ఆదాయం



గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు వేసిన కానుకలను తనిఖీ అధికారి కె.వి. గోపాలరావు సమక్షంలో సోమవారం లెక్కించారు. 57 రోజులకు గాను రూ.26,17,186 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కానూరి సురేష్, చైర్మన్ శేషం గోపి తెలిపారు. అలాగే ఐదు గ్రాముల బంగారంతో పాటు 193 గ్రాముల వెండి కానుకల కింద వచ్చాయన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు పామర్తి వెంకటస్వామి, కొమ్మనబోయిన రవిశంకర్, వల్లూరు వెంకట్రావు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

- జగనన్న సంక్షేమ పథకాలతో మత్స్యకారుల బతుకులకు భరోసా
- గతంతో పోల్చితే పెరిగిన ఆయిల్ సబ్సిడీ, వేట నిషేధ భృతి
- బీమా కింద రూ.10 లక్షలు అందజేత



నాగాయలంకలో ఎండు చేపల వారపు సంత

నాగాయలంక(అవనిగడ్డ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తీర ప్రాంతాల్లో జీవించే మత్స్యారుల జీవితాల్లో కొత్త వెలుగులు ఆవిష్కృతమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మత్స్యకారుల బతుకులకు భరోసా దొరికింది. దివిసీమలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల కుటుంబాలకు పైగా మత్స్య పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. దివిసీమలోని నాగాయలంక, కోడూరు మండలాల్లో సంగమేశ్వరం నుంచి నాలి, సొర్లగొంది, దీనదయాళపురం, పర్రచివర, ఏటిమొగ, గుల్లలమోద, ఎదురుమొండి దీవుల్లోని ఈలచెట్లదిబ్బ, నాచుగుంట, ఎదురుమొండి, నాగాయలంక, పాలకాయతిప్ప, బసవవానిపాలెం, హంసలదీవి తదితర గ్రామాల్లో బంగాళాఖాతం, కృష్ణానదిలో అత్యధిక మత్స్యకార కుటుంబాలు నిత్యం చేపల వేట సాగిస్తున్నాయి. నాగాయలంక, కోడూరు మండలాల్లో 1182 మోటరైజ్‌డ్ నావలకు గతంలో లీటరుకు రూ.6.03 సబ్సిడీ ఇవ్వగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రస్తుతం తొమ్మిది రూపాయల సబ్సిడితో నెలకు 300 లీటర్లు ఇస్తున్నారు. ఆమేర సబ్సిడీ వరకు తగ్గించి ఎంపికచేసిన పెట్రోలు బంకుల్లో నేరుగా ఆయిల్ తీసుకోవచ్చు. రెండవది చేపలవేట నిషేధకాలంలో ఇంతకు ముందు కేవలం రూ.4వేలు ఉన్న భృతిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద ఏకంగా రూ.10 వేలకు పెంచి 5,246 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం సాయం అందిస్తోంది. వేట సమయంలో ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఇచ్చే బీమా గత ప్రభుత్వంలో నామమాత్రంగా ఉంటే జగనన్న ప్రభుత్వం రూ.10 లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే రూ.5 లక్షలు ఇస్తుంది. ప్రజాసంకల్ప పాదయాత్రలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన విద్యుత్ చార్జీలు, ఆయిల్ సబ్సిడీ లాంటి రాయితీలను ప్రభుత్వం రాగానే అమలులోకి తేవడంతో అటు ఆక్వా రైతులు, మత్స్యకారుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

నాగాయలంకలో నేడు మత్స్య దినోత్సవం...

నాగాయలంక కృష్ణానది ఒడ్డున ఉన్న మత్స్య భవనం వద్ద మంగళవారం ప్రపంచ మత్స్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు అవనిగడ్డ మత్స్యశాఖ సహాయ సంచాలకురాలు ఆర్.ప్రతిభ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు 11 టీవీఎస్ మోపెడ్‌లు పంపిణీ, పీఎంఎంఎస్‌వై కింద రూ.10 లక్షలతో మంజూరైన ఫిష్ ఆంధ్రా డైలీ షాపును ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పేర్కొన్నారు. తీరప్రాంత మత్స్యకారులందరూ ఈ వేడుకకు తరలి రావాలని కోరారు.

డ్రై ఫిష్‌పై ఆధారపడి

కృష్ణానది తీరంలోని నాగాయలంకలో దశాబ్దాల కాలంగా ప్రతి ఆదివారం (ఇపుడు శనివారమే ముగుస్తుంది) జరిగే వారపు సంతలో డ్రై ఫిష్ అమ్మకాలు మత్స్యకార మహిళల బతుకు వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తుంటాయి. వారానికి ఒకసారి మాత్రమే జరిగే డ్రై ఫిష్ అమ్మకాలు గత 5 దశాబ్దాలుగా కేవలం ఆదివారం మాత్రమే కొనసాగుతూ వచ్చిన ఈ డ్రై ఫిష్ మార్కెట్ కొద్ది సంవత్సరాలుగా సంత ఆశీల పాటదారుల నిర్వాకం కారణంగా ప్రస్తుతం శనివారం రాత్రికే ముగించేస్తున్నారు. పండుగప్ప, మాగ, మాతగురక వంటి భారీచేపలు, రొయ్యపప్పు, చప్పిడి మెత్తళ్ళు, సోవడాయలు లాంటి వాటికి ఇక్కడి డ్రై ఫిష్‌మార్కెట్ తరతరాలుగా ప్రసిద్ధి. నాగాయలంక సంతలో ఉప్పుచేపలు (డ్రై ఫిష్) అమ్మకాలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడి వారాంతాపు సంత కాకుండా మోపిదేవి వార్పు, కరకట్ట వెంట నడకుదురు తదితర ప్రాంతాల్లో డ్రై ఫిష్ దుకాణాలు విక్రయాలు నిత్యం సాగిస్తుంటారు.

పటిష్టంగా పాఠశాలల పర్యవేక్షణ

- బడుల బలోపేతం దిశగా విద్యాశాఖ అడుగులు
- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలపై ప్రత్యేక నిఘా
- నాణ్యమైన విద్య, వసతుల కల్పనపై దృష్టి
- ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈవోలు నియామకం



నాడు-నేడుతో అభివృద్ధి చెందిన పెడన మండలం పెనుమల్లి ప్రాథమిక పాఠశాల

పెడన: విద్యా రంగంలో అనేక సంస్కరణలకు ప్రభుత్వం నాంది పలికింది. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించే విధంగా అనేక పథకాలు అమలు చేస్తోంది. నాడు-నేడుతో పాఠశాలల్లో వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తోంది. వసతులు, పథకాలు సమర్థవంతంగా అమలయ్యేందుకు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నాణ్యమైన విద్యా బోధన, సకాలంలో సిలబస్ పూర్తి చేయడం, పరీక్షల నిర్వహణ, ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నారా..లేదా వంటి వాటిని పరిశీలించేందుకు, పర్యవేక్షించడానికి విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింది. గతంలో మూడు మండలాలకు ఒక ఎంఈవో మాత్రమే ఉన్న తీవ్ర ఒత్తిడి పరిస్థితి నుంచి ప్రతి మండలానికీ ఇద్దరు ఎంఈవో (మండల విద్యాశాఖాధికారులు)లను నియమించింది. వీరికి పని విభజన కల్పిస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఇటీవల ఉత్తర్వులు వెలువరించారు. ప్రభుత్వ నిర్ణయంతో పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలానికి ఇద్దరు ఎంఈవోలు

జిల్లా వ్యాప్తంగా 26 మండలాల్లో 1,802 పాఠశాలలున్నాయి. వీటిల్లో సుమారు 2,22,714 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులను అధునాతనంగా సుందరీకరించి, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసి ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వసతులు కల్పించింది. ఇంగ్లిష్ మీడియం పరిచయం చేయడంతో పాటు వర్చువల్ పద్ధతిలో విద్యా బోధనకు కృషి చేస్తోంది. టోఫెల్ విధానంలో పరీక్షలు, 9వ తరగతి నుంచి సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయడానికి 8వ తరగతిలోనే విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ఇవి పక్కాగా విద్యార్థులకు చేరుతున్నాయా లేదా అనే దానిపైన, ప్రభుత్వం విద్యారంగ చర్యలు అమలవుతున్నది లేనిదీ పరిశీలించడానికి మండలానికి ఇద్దరు ఎంఈవోలు నియామకం చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో పకడ్బందీగా అమలు చేసేందుకు ఎంఈవోలను నియమించింది. ఇప్పటికే 26 మండలాలకు ఎంఈవో 2లను నియమించిన విద్యాశాఖ 12 మంది ఎంఈవో –1లను నియమించి 26 మండలాలకు బాధ్యతలను అప్పగించింది.

ప్రైవేటు ఆగడాలకు అడ్డుకట్ట....

కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారం నడుచుకుంటున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న అకడమిక్ పుస్తకాలతోనే విద్యా బోధన చేపట్టాలనే నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయి. సొంతంగా రూపొందించుకుంటున్న తమ మెటీరియల్‌ను విద్యార్థులకు బలవంతంగా అంటగడుతున్నాయి. వేలాది రూపాయలను తల్లిదండ్రుల నుంచి గుంజుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పరీక్షలను నిర్వహిస్తున్నాయి. ఇలాంటి అక్రమ వ్యవహారాలపై చర్యలు తీసుకునేందుకు, వాటిని చక్కదిద్దేందుకు ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈవోలుండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

బాధ్యతలు అప్పగించాం



మండలానికి ఇద్దరు ఎంఈవోలను నియమించాం. గతంలో మూడు మండలాలకు ఒకే ఎంఈవో ఉండేవారు. అటువంటి పరిస్థితి నుంచి మండలానికి ఇద్దరు ఎంఈవోలను నియమించాం. జిల్లాలోని 26 మండలాలకు 26 మంది ఎంఈవో–2లున్నారు. వీరంతా జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన ఎంఈవోలు. ఎంఈవో–1లు మాత్రం 12 మంది ఉన్నారు. వీరికి 26 మండలాల బాధ్యతలను అప్పగించాం.

తాహెరాసుల్తానా, జిల్లా విద్యాశాఖాధికారి

స్పందన సమస్యలు సకాలంలో పరిష్కరించాలి



వెంకటేశ్వరరావు చేతులు పట్టుకుని పరీక్షిస్తున్న జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): స్పందనలో వచ్చిన అర్జీల పట్ల అధికారులు సానుకూలంగా స్పందించి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం స్పందన నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో ఎం.వాణి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల పట్ల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వతమైన పరిష్కారం చూపాలన్నారు. 159 అర్జీలను అధికారులు స్వీకరించారు.

వైద్యురాలైన జాయింట్ కలెక్టర్...

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఓ అర్జీదారుడు ఇచ్చిన వినతిపత్రానికి జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ వైద్యురాలై పరీక్షలు నిర్వహించారు. మచిలీపట్నం నగరంలోని శారదానగర్ వడ్డి రంగారావు కాలనీకి చెందిన పి. వెంకటేశ్వరరావు అనే వికలాంగుడు తనకు బ్యాటరీ మూడు చక్రాల వాహనం కావాలని స్పందనలో వినతిపత్రం అందజేశాడు. వినతిపత్రంతో పాటు వైద్యుల సర్టిఫికెట్‌ను పరిశీలించిన అనంతరం కలెక్టర్ రాజాబాబు వెంకటేశ్వరరావు చేతులు వాహనం నడిపేందుకు పట్టుగా ఉంటాయా, లేదా అనే అంశంపై మీమాంసతో అతన్ని ప్రశ్నించారు. ఈ సమయంలో స్టేజీ పై ఉన్న జేసీ అపరాజితసింగ్ కిందకు వచ్చి వెంకటేశ్వరరావు చేతులను తన చేతులతో పట్టుకుని గట్టిగా నొక్కాలని పరీక్ష చేశారు. అతని చేతి పట్టు ఏ విధంగా ఉందో ఆమె పరిశీలించారు. పట్టు సరిగ్గా ఉంటే మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని అందజేస్తామని చేతులు పట్టులేకపోతే వాహనం ఇచ్చినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని ఆమె వెంకటేశ్వరరావు వివరించారు. వైద్యురాలిగా జేసీ అపరాజితసింగ్ వెంకటేశ్వరరావు చేతులు పట్టులేదని నిర్ధారణ అయిన తరువాత నెల రోజుల పాటు ఫిజియోథెరపీ చేయించాలని డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయిని ఆమె ఆదేశించారు. అనంతరం వెంకటేశ్వరరావు చేతులు వాహనం నడిపేందుకు పట్టుగా ఉంటే మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని అందజేస్తామని బదులిచ్చారు.

పేదల ఆత్మ బంధువు జగనన్న



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: జగనన్న పేదల ఆత్మ బంధువు అని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరారావు (నాని) అన్నారు. గుడివాడ 11వ వార్డులో సోమవారం ముస్లిం మైనార్టీ సంచార జాతులకు కుల ధ్రువీకరణ బీసీ (ఈ) సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలను గుర్తించి వారికి సమాజంలో మెరుగైన స్థానం కల్పించిన ఘనత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం మైనార్టీలు వెనుకబడి ఉన్నారని గుర్తించి నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటవేశారని చెప్పారు. ఆయన కుమారుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ముస్లింలలో ఒక వర్గమైన సంచారజాతులు (ఫకీరు) లను గుర్తించి వారికి కార్పొరేషన్ ఏర్పాటుచేయడంతో పాటు రాజకీయ గుర్తింపు తెచ్చి రిజర్వేషన్‌లో వాటా కల్పించారని పేర్కొన్నారు. అందులో భాగంగా వారిని బీసీఈ గా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు పొందే వెసులుబాటు కల్పించారన్నారు. 22 మంది ముస్లిం మైనార్టీలకు బీసీఈ సర్టిఫికెట్‌లు అందించామని వెల్లడించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మంచినీటి సమస్య పరిష్కారానికి పట్టణంలో 100 ఎకరాలు కొంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నందివాడ మండలం జనార్ధనపురంలో 110 ఎకరాలు కొనుగోలు చేశారని వివరించారు. ఇవి కాక టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టి 74 ఎకరాలు, జగనన్న కాలనీ కోసం 180 ఎకరాలు, గుడ్లవల్లేరులో 30 ఎకరాలతో కలిపి మొత్తం నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు 625 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన ఘనత తండ్రీ కొడుకులకే దక్కుతుందన్నారు. త్వరలోనే అన్ని రోడ్లు మరమ్మతులు చేసి అవసరమైన చోట పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), తహసీల్దార్ కె.ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలేటి చంటి, పాలడుగు రామ్‌ప్రసాద్, ఎంవీ నారాయణరెడ్డి, సంచారజాతుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ షేక్ సయ్యద్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాఘాట్‌లో పుణ్య స్నానాలకు అనుమతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు సోమవారం నుంచి భక్తులను అనుమతించారు. తెల్లవారుజామున పవిత్ర దుర్గాఘాట్‌లో కృష్ణమ్మకు ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఆలయ వైదిక కమిటీ సభ్యులు మారుతీ యజ్ఞనారాయణ శర్మ పూజలు నిర్వహించారు. కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, పూజా సామగ్రిని సమర్పించారు. తొలుత ఆలయ స్థానాచార్య, అర్చకులు కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఘాట్‌లోకి స్నానాలు చేసేందుకు భక్తులను అనుమతించారు. కార్తీక మాసం నుంచి నదిలోకి దిగి పుణ్యస్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి పాలక మండలి సభ్యులు, చైర్మన్ కర్నాటి రాంబాబు పాలక మండలి సమావేశంలో తీర్మానించారు. గత రెండు నెలలుగా స్నానఘాట్‌లో పూడిక తీత పనులు చేపట్టారు. కార్తిక మాసం తొలి సోమవారం నేపథ్యంలో భక్తులను నదిలోకి స్నానాలకు అనుమతించామని ఈఈ ఎల్. రమాదేవి పేర్కొన్నారు.



కృష్ణానదిలో స్నానాలు చేస్తున్న భక్తులు

రేపటి నుంచి ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంటు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు 39వ ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని విజయవాడ రీజియన్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి చెప్పారు. కృష్ణలంకలోని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఏపీ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం టోర్నమెంట్ లోగోను ఆవిష్కరించారు.

రైతుల సంక్షేమమే సహకార వ్యవస్థ ధ్యేయం

- డిపాజిట్ల సేకరణపై దృష్టి సారించాలి
- కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి
- ఉల్లిపాలెంలో అఖిల భారత సహకార వారోత్సవాలు ముగింపు సభ

కోడూరు: రైతులకు అవసరమైన రుణాలను త్వరితగతిన మంజూరు చేసి, వారి సంక్షేమమే ధ్యేయంగా సహకార వ్యవస్థ పని చేస్తుందని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. 70వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మండలంలోని ఉల్లిపాలెం పీఏసీఎస్ వద్ద సోమవారం నిర్వహించారు. సంఘ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో పద్మావతి మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంకు రూ.10,500 కోట్లకు పైగా టర్నోవర్ సాధించి దేశంలోనే ఐదవ స్థానంలో నిలిచిందని చెప్పారు. సహకార బ్యాంకులు అందించే సేవలను ప్రజలకు తెలియజేసి, వాణిజ్య బ్యాంకులకు దీటుగా పని చేయాలన్నారు. తీరప్రాంత రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన చుక్కల భూములు, నిషేధిత భూముల సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారని, ఆ భూములకు కూడా రుణ సౌకర్యం కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు పద్మావతి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 7లక్షల కొత్త ఖాతాలను ప్రారంభించాలని ఆప్కాబ్ లక్ష్యంగా నిర్దేశించిందని, అందులో భాగంగా కేడీసీసీ బ్యాంకుల్లో కనీసం 50 వేల ఖాతాలను తెరిచేలా సిబ్బంది పని చేయాలన్నారు. సంఘాల్లో రుణాల మంజూరుతో పాటు డిపాజిట్ల సేకరణపై కూడా ప్రత్యేక దృష్టి సారించారని, వీటి ద్వారా సంఘాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని అన్నారు. ఉల్లిపాలెం పీఏసీఎస్ ద్వారా రూ.13 కోట్ల రుణాలు రైతులకు అందించడంతో పాటు సంఘం ద్వారా రూ.5.25 లక్షల నికర లాభాన్ని ఆర్జించినట్లు సీఈఓ మత్తి అర్జునరావు సభ దృష్టికి తీసుకువచ్చారు.



గ్రామ పురవీధుల వెంట నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతి, సిబ్బంది

సేవలను వివరిస్తూ ర్యాలీ, మానవహారం

తొలుత సహకార రంగ సేవలను వివరిస్తూ పద్మావతి సంఘ చైర్‌పర్సన్లు, సిబ్బందితో కలిసి గ్రామ పురవీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. రైతులు, మహిళలు, విద్యార్థులకు సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను మైక్‌ల ద్వారా వివరించారు. అనంతరం ప్రధాన కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ నిర్వహించారు. ముందుగా కార్యాలయం వద్ద సహకార పతాకాన్ని పద్మావతి ఆవిష్కరించారు. సహకార యూనియన్ రాష్ట్ర విద్యాధికారి కె.భోజరంగరాజు, సబ్ డివిజన్ సహకార అధికారి డి.నాగమల్లేశ్వరరావు, కేడీసీసీబీ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ భోగాది శ్యాంప్రసాద్, వక్కలగడ్డ, లింగారెడ్డిపాలెం చైర్‌పర్సన్లు సురేంద్రనాథ్ బెనర్జీ, చిట్టిప్రోలు బ్రహ్మారావు, సర్పంచి వెర్రీ పావని, కేడీసీసీ కోడూరు బ్రాంచి మేనేజర్ ఎ.సుధీర్, సీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

హంసలదీవి సాగరతీరంలో వన సమారాధన

జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో హంసలదీవి సాగర తీరంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. జిల్లాలోని అన్ని కేడీసీసీ, పీఏసీఎస్‌ల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో పాటు సంఘాల చైర్‌పర్సన్లు ఈ సమారాధనలో పాల్గొన్నారు. కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొని, సిబ్బందితో కలిసి సరదాగా గడిపారు.

అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

- ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్ష
- టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు హెచ్చరిక



చిలకలపూడి(మచిలీపట్నం): ధాన్యం సేకరణ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. సోమవారం ఉదయం జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో పెద్ది రోజాలతో కలిసి జిల్లా, క్షేత్రస్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం సేకరణ కార్యక్రమం మొదలైన నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పౌర సరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలతో పాటు సహకార శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సీజన్‌లో ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి సమస్య రాకూడదని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ రైతు భరోసా కేంద్రాల పనితీరును పరిశీలించాలన్నారు. మండల వ్యవసాయాధికారులు, రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి ధాన్యం సేకరణ ప్రకియ సజావుగా జరుగుతున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. జిల్లా అధికారులు వారికి కేటాయించిన మండలాల్లో వివిధ సంక్షేమ వసతిగృహాలను తనిఖీ చేసి వాటి స్థితిగతుల వివరాలను తెలియజేయాలన్నారు. తక్షణమే మరమ్మతులు చేయాల్సిన భవనాలకు సంబంధించిన ప్రతిపాదనలను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేయాలన్నారు. ఓటర్ల జాబితా పరిశీలకులుగా నియమితులైన రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి బి.శ్రీధర్ ఈ నెల 22న జిల్లాకు రానున్నారు. ఈలోగా ఎన్నికల అధికారులు వారి నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్లు, జనాభా నిష్పత్తి, స్త్రీ, పురుషుల నిష్పత్తి, యువ ఓటర్లకు సంబంధించిన రికార్డులు, బూత్ స్థాయి అధికారుల రిజిష్టర్లు అన్నీ సిద్ధం చేసుకోవాలన్నారు.

23 నుంచి భవానీ మండల దీక్షలు

- 26న కోటి దీపోత్సవం
- డిసెంబర్ 13 నుంచి అర్ధమండల దీక్షలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఈనెల 23వ తేదీ గురువారం నుంచి భవానీ మండల దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంద్రకీలాద్రిపై నిర్వహించే ఉత్సవాలలో రెండో అతి పెద్ద ఉత్సవమైన భవానీ దీక్షలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. 23 నుంచి ఐదు రోజుల పాటు భక్తులు అమ్మవారి మండల దీక్షలను స్వీకరిస్తారు. దీక్ష స్వీకరణ కార్యక్రమాన్ని దేవస్థానం ఎంతో వైభవంగా నిర్వహిస్తుంది. గురువారం ఉదయం అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి పగడాలతో చేసిన దండను అలంకరిస్తారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రధాన ఆలయం నుంచి మహా మండపం ఆరో అంతస్తుకు ఊరేగింపుగా తీసుకొస్తారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అఖండ జ్యోతి ప్రజ్వలనతో దీక్ష స్వీకరణ మహోత్సవం లాంఛనంగా ప్రారంభమవుతుంది. అమ్మవారి ఆలయంతో పాటు ఘాట్ రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద, గురు భవానీల పీఠంలోనూ భక్తులు అమ్మవారి దీక్షలను స్వీకరిస్తారు.

26న కోటి దీపోత్సవం

కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈనెల 26వ తేదీ ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం వెలిగిస్తారు. 27వ తేదీ ఉదయం 5:55 గంటలకు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ జరుగుతుంది.

13 నుంచి అర్ధమండల దీక్షలు

డిసెంబర్ 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు భక్తులు అమ్మవారి అర్ధమండల దీక్షలను స్వీకరిస్తారు. ఇక డిసెంబర్ 26వ తేదీ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి కలశజ్యోతి మహోత్సవం విజయవాడ సత్యనారాయణపురంలోని శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి ప్రారంభమవుతుంది. దీక్ష విరమణలు వచ్చే ఏడాది జనవరి 3వ తేదీన ప్రారంభమై జనవరి 7వ తేదీ వరకు కొనసాగుతాయి. 3వ తేదీ ఉదయం మహామండపం వద్ద దేవస్థానం ఏర్పాటు చేసే హోమగుండాలలో అగ్నిప్రతిష్ఠాపనతో దీక్ష విరమణలు ప్రారంభమవుతాయి. జనవరి 7వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో నిర్వహించే పూర్ణాహుతితో దీక్ష విరమణలు పరిసమాప్తమవుతాయి.

ప్రజల రక్షణ కోసమే పోలీసులు

- స్పందనలో అర్జీలు స్వీకరించిన జిల్లా ఎస్పీ జాషువా
- బాధితులందరికీ న్యాయం చేస్తామంటూ హామీ

కోనేరుసెంటర్(మచిలీపట్నం): ప్రజల రక్షణ కోసమే పోలీస్ వ్యవస్థ పని చేస్తుందని జిల్లా ఎస్పీ పి.జాషువా తెలిపారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లోని స్పందన హాల్లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు.

అర్జీలు

- మచిలీపట్నంకు చెందిన రాణి అనే బాధితురాలు ఎస్పీని కలిసి తన సమస్యను విన్నవించుకుంది. మూడేళ్ల కిందట తనకు వివాహం కాగా ఇద్దరు ఆడపిల్లలు కలిగినట్లు చెప్పింది. ఆడపిల్లలు పుట్టారని కోపంతో అత్తింటి వారు తన భర్తకు మరో వివాహం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, తన విలువైన సర్టిఫికెట్లను వారి వద్ద ఉంచుకుని భర్తకు విడాకులు ఇవ్వకుంటే వాటిని చింపేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.
- పెనమలూరు కు చెందిన నాంచారయ్య అనే వృద్ధుడు తనకు ఇద్దరు మగపిల్లలు కాగా పెద్ద కొడుకు ప్రమాదవశాత్తు చనిపోయాడని అప్పటి నుంచి కోడలు ఆస్తి కోసం తమను నానా హింసలు పెడుతోందని వాపోయారు. పుట్టింటి తరపు బంధువులను తీసుకువచ్చి తమపై దాడికి సైతం తెగబడుతోందని, ఆమె నుంచి రక్షణ కల్పించి తమకు న్యాయం జరిగేలా చూడాలని ప్రాధేయపడ్డాడు.
- మచిలీపట్నంకు చెందిన చందు అనే యువతి బీటెక్ చదువుకున్న తనకు ప్రముఖ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి సమీప బంధువైన వ్యక్తి తమ వద్ద నుంచి మూడు లక్షల రూపాయలు తీసుకున్నాడని చెప్పింది. ఉద్యోగం రాకపోవడంతో డబ్బు తిరిగి ఇవ్వమంటే ఇవ్వడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరింది.
- తోట్లవల్లూరు కు చెందిన రామారావు అనే వ్యక్తి తన కుమార్తెను సమీప బంధువుకి ఇచ్చి వివాహం జరిపించానని, అయితే అల్లుడు పరాయి స్త్రీ వ్యామోహంలో పడి తన కుమార్తెకు అన్యాయం చేయాలని చూస్తున్నాడని ఆమెకు న్యాయం చేయాలని ప్రాధేయపడ్డాడు.



స్పందనలో బాధితుల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ జాషువా

ఉత్సాహంగా ఏపీ స్కూల్స్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): చెస్ ఆడటం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరగడమే కాకుండా శరీరంలోని మెదడు చురుకుగా పనిచేస్తుందని ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ వి.కోటేశ్వరమ్మ చెప్పారు. స్థానిక కానూరులోని స్కాట్ స్ప్రిన్ స్కూల్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ స్కూల్స్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం ఆమె బహుమతులు అందజేశారు. చెస్ టోర్నమెంట్‌లో 8 నుంచి 16 ఏళ్ల లోపు వయస్సు ఉన్న 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కో–ఆర్డినేటర్ డాక్టర్ వెలగా జోషి, మెప్మా స్టేట్ మిషన్ మేనేజర్ ఎస్ఎస్ఆర్ శ్రీనివాస్, చెస్ కోచ్ ఎస్‌కే కాశీం, రవీంద్ర భారతి స్కూల్ డైరెక్టర్ శాంతి, ఆంధ్రా చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ అమ్మినేని ఉదయ్‌కుమార్, ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ ప్రెసిడెంట్ జె.శైలజ, స్కాట్ స్ప్రిన్ స్కూల్ సీఈఓ కె.జాహ్నవి, కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.ఎం.ఫణి కుమార్ పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన 120 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



బహుమతులు సాధించిన విజేతలతో అతిథులు

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి



మృతి చెందిన లెహన్య

పెనమలూరు: కానూరులో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు ఎస్‌బీఐ కాలనీకి చెందిన కొమ్మినేని సుబ్బారావుకు భార్య ఇద్దరు పిల్లలు. ఆయన ఖమ్మంలో ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తాడు. కుమార్తె లెహన్య(16) విజయవాడలో నారాయణ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె కుడి చేయి లాగటం వలన అనారోగ్యంతో సరిగా చదవలేకపోతోంది. ఈ నెల 17వ తేదీన కాలేజీలో ఉండగా జ్వరం రావటంలో టాబ్లెట్ వేశారు. మరల 18న కూడా అనారోగ్యంగా ఉండటంతో లెహన్యను కానూరులో ప్రైవేటు ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చూపించారు. అయితే ఆదివారం రాత్రి ఒక్కసారిగా ఆమె ఆరోగ్యం క్షీణించటంతో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను విజయవాడ ప్రైవేటు ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకు వెళ్లారు. అక్కడ లెహన్య మృతి చెందింది. ఆమె మరణంపై తండ్రి సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వటంతో కేసు నమోదు చేశారు. ఆమె మరణానికి కారణం తెలియలేదు. పోస్టుమార్టం రిపోర్టు రావల్సి ఉంది.

ప్రేమికుల ఆత్మహత్య

రైలు కింద పడి బలవన్మరణం



ఆత్మహత్యకు పాల్పడిన పావని, రాకేష్ (ఫైల్)

గూడూరురూరల్ (తిరుపతి జిల్లా): విజయవాడలోని కోచింగ్ సెంటర్లో కుదిరిన స్నేహం విడదీయరాని బంధంగా మారింది. పెద్దలు ఎక్కడ తమను కలుసుకోకుండా చేస్తారో అన్న భయంతో ఆ జంట గూడూరుకు సమీపంలో ఆదివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా శ్రీరుక్మిణీపురానికి చెందిన అన్నంగి పావని (19) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసింది. చిల్లకూరు మండలంలోని ఓ హోటల్‌లో పని చేసేందుకు సొంత ఊరి నుంచి తల్లిదండ్రుల అనుమతి తీసుకుని రెండు రోజుల క్రితం వచ్చింది. అక్కడ నుంచి తనకు గతంలో విజయవాడ లోని కోచింగ్ సెంటర్‌లో చదువుకుని ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా సగిపాడు గ్రామానికి చెందిన దండే రాకేష్(23)ను గూడూరుకు రావాలని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. దీంతో ఆదివారం అతను గూడూరు వచ్చాడు. ఇద్దరూ కలుసుకుని చాలా సేపు మాట్లాడుకున్నారు. అనంతరం తమ ప్రేమ పెద్దలకు ఇష్టం లేకపోతే ఇద్దరూ దూరం కావాల్సి వస్తుందని భావించిన వారు ఒకరిని విడిచి ఒకరు ఉండలేక గూడూరు రైల్వే స్టేషన్ నుంచి సుమారు మూడు కిమీ దూరంలో ఉన్న గాంధీనగర్ ప్రాంతం వరకు ట్రాక్‌పై నడిచి వెళ్లి అక్కడ రైలు పట్టాలపై పడుకున్నారు. వారిపై నుంచి గూడ్స్ ట్రైన్ వెళ్లడంతో తలలు తెగి వారు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ సంఘటన గూడూరు డివిజన్‌లో సంచలనం సృష్టించింది. యువతీ యువకుల మృతదేహాలను గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సోమవారం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తమ బిడ్డల మృతదేహాలను చూసి వారిరువురి తల్లిదండ్రులు ఆసుపత్రి వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.

ఎస్ఆర్ఆర్‌లో ఉత్సాహంగా రెజ్లింగ్ పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళలు, పురుషుల రెజ్లింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ప్రారంభించారు. పోటీలలో ఎస్ఆర్ఆర్ కళాశాలతో పాటు పీబీ సిద్ధార్థ కళాశాల, వికాస్ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, నున్న, కేబీఎన్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. హోరాహోరీగా జరిగిన వివిధ వెయిట్ కేటగిరీలలో ఎస్‌కే ఖాశిం బాషా, కె.హరిశంకర్, కె.అజయ్, సీఎస్ సాయి తేజ తదితరులు విజేతలుగా నిలిచారు. విజేతలు చండీగఢ్‌లో నిర్వహించే రెజ్లింగ్ పోటీలలో కృష్ణా యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర కె.భాగ్యలక్ష్మి, వ్యాయామ విద్య విభాగాధిపతి మండవ కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్ అభినందించారు.



విజేతలతో ఎస్ఆర్ఆర్ కళాశాల సిబ్బంది

గన్నవరం-పుట్టగుంట రహదారి విస్తరణకు రంగం సిద్ధం

గన్నవరం: వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే గన్నవరం–పుట్టగుంట ఆర్అండ్‌బీ రహదారి విస్తరణకు రంగం సిద్ధమైంది. సుమారు రూ.35 కోట్లు సీఆర్ఎఫ్ నిధులతో ప్రస్తుతం ఉన్న రహదారిని బలోపేతం చేయడంతో పాటు విస్తరించనున్నారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ శంకుస్థాపన చేశారు. త్వరితగతిన పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్ట్ సంస్థ సన్నద్ధమవుతోంది. గన్నవరం నుంచి వయా పుట్టగుంట మీదుగా గుడివాడ వెళ్లేందుకు ఈ రహదారే ప్రధాన మార్గం. గతంలో పోల్చితే ఈ రహదారిపై వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. దీంతో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు విస్తరణ పనులు చేపట్టనున్నారు.



విస్తరించనున్న గన్నవరం-పుట్టగుంట రహదారి

20 కిలోమీటర్ల పొడవునా...

అధ్వానంగా ఉన్న ఈ రహదారిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో 2022లో రూ.9.80 కోట్లతో గన్నవరం నుంచి ఉంగుటూరు వరకు అభివృద్ధి చేసింది. దావాజిగూడెం గ్రామంలో పటిష్ఠంగా సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. ఈ నేపథ్యంలో గన్నవరంలోని జీరో పాయింట్ నుంచి పుట్టగుంట వరకు 20.690 కిలో మీటర్లు పొడవునా ఏడు మీటర్లు వెడల్పు ఉన్న ఈ రహదారిని పది మీటర్లకు విస్తరించనున్నారు. అంతే కాకుండా భారీ వాహనాల తాకిడిని తట్టుకుని నిలబడే విధంగా రోడ్డును బలోపేతం చేయనున్నారు. దావాజిగూడెం రామాలయం నుంచి గన్నవరంలోని నేషనల్ హైవే వరకు సీసీ రోడ్డును నిర్మించనున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే గన్నవరం నుంచి పుట్టగుంట వరకు విశాలమైన డబుల్ లైన్ రోడ్డు అందుబాటులోకి రానుంది.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

గన్నవరం-పుట్టగుంట ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయింది. రహదారి విస్తరణ నిమిత్తం సర్వే పనులు చేపట్టాల్సి ఉంది. వీటిని త్వరితగతిన పూర్తిచేసి విస్తరణ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.
– శ్రీహరి, ఆర్అండ్‌బీ ఏఈ

అంతర్జాతీయ కరాటే పోటీలకు జంక్షన్ క్రీడాకారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: విశాఖపట్టణంలో జరగనున్న 19వ డబ్ల్యూకేఐ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2023 పోటీల్లో పాల్గొనేందుకు హనుమాన్‌జంక్షన్‌కు చెందిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ కట్టా సుధాకర్ సోమవారం తెలిపారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో విశాఖ పోర్టు స్టేడియంలో జరిగే ఈ కరాటే పోటీల్లో 15 దేశాల నుంచి క్రీడాకారులు హాజరుకానున్నారని చెప్పారు. బాలుర విభాగంలో శివ సాయి ఆశ్రిత్ (27 కేజీలు), కట్టా మనోజ్ (27 కేజీలు), నిమ్మల వృశాంక్ (30 కేజీలు), కత్తుల సుందర చైతన్య (31 కేజీలు), కాంచన శర్వానంద్ (43 కేజీలు), తమ్మిన సూర్య సత్య నాగ ఈశ్వర్, కొనకళ్ల లోకేష్ కుమార్ (48 కేజీలు), ఆది విష్ణు నీల మణికంఠ (59 కేజీలు) పాల్గొంటారని వివరించారు. బాలికల విభాగంలో మత్తి హర్షిత (31 కేజీలు), మాటూరి సాహిత్యలక్ష్మి (43 కేజీలు), గోలి గోపిక (41 కేజీలు), కొనకళ్ల హారిక ధనలక్ష్మి (66 కేజీలు) పాల్గొంటారని కోచ్ కట్టా సుధాకర్ చెప్పారు. అంతర్జాతీయ కరాటే పోటీలకు హాజరుకానున్న ఈ క్రీడాకారులను శేరినరసన్నపాలెంకు చెందిన కమ్మిలి సూర్యనారాయణ మూర్తి అభినందించి, ఆర్థికసాయాన్ని అందించారని తెలిపారు.



అంతర్జాతీయ కరాటే పోటీలకు హాజరుకానున్న క్రీడాకారులతో కోచ్ కట్టా సుధాకర్

అర్ధరాత్రి ఇంటిపైకి దూసుకెళ్లిన లారీ

ఇబ్రహీంపట్నం: స్థానిక రింగ్ సెంటర్ సమీపంలో గాజులపేట వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న పైలా జమలమ్మ ఇంటిపైకి ఆదివారం అర్ధరాత్రి విజయవాడ వైపు నుంచి కంచికచర్ల వైపు వెళ్తున్న పది టైర్ల టిప్పర్ లారీ దూసుకెళ్లింది. ఇంటిగోడలు, సామగ్రి ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో కుటుంబ సభ్యుల్లో ఒక్కరు తప్ప మిగతా ఐదుగురు లోడింగ్ పనికి వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఎవరికీ గాయాలు కాలేదు. పోలీసులు టిప్పర్ లారీని అక్కడ నుంచి తొలగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.